క్లుప్తంగా

బాల్యం నుంచే ఆధ్యాత్మిక చింతన అవసరం



కోలాటమాడిన చిన్నారులకు దుస్తులు అందిస్తున్న మజ్జి సోమేష్

మల్కాపురం: చిన్నారులకు చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన అవసరం అని 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ అన్నారు. కోలాట గురువు సునీత వద్ద శిక్షణ తీసుకుంటున్న పలువురు చిన్నారులకు అవసరమైన సంప్రదాయ వస్త్రాలను ఆయన అందించారు. మల్కాపురం వద్ద ఆదివారం ఆయన సొంత నిధులతో సుమారు 20 మంది చిన్నారులకు దుస్తులు అందజేశారు. కోలాటం గురువు సునీత, నాయకులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారి వాసుపల్లి విజయమ్మ

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఏకాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతుల కల్పనకు ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండకు భక్తులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎండల తీవ్రతకు శాశ్వత షెల్టర్ నిర్మించాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

మద్యం దుకాణం ఎదుట వంటా వార్పు

అల్లిపురం: మాకొద్దు మద్యం షాపు అంటూ వారం రోజులుగా భూపేష్‌నగర్ వాసులు ఆందోళన చేస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం ఆందోళనకారులు మద్యం దుకాణం ఎదుట వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. అక్కడే చిన్నా, పెద్ద తేడా లేకుండా భోజనాలు చేసి తమ నిరసన తెలిపారు. వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గాని, అధికారులు గాని పట్టించుకోకపోవడం పట్ల నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు దశదిశలా విస్తరింపచేయాలని, విద్యార్థులంతా భాగస్వాములు కావాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖ జిల్లా కార్యదర్శి దాసరి వేణుగోపాల్ కోరారు. జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా ఈ నెల 31న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, అబ్దుల్ కలామ్ యూ ఆర్ గ్రేట్ ఓపెన్ టీం, మదర్ థెరీసా ఓపెన్ రేంజర్ టీం ఆధ్వర్యంలో ఉచితంగా భోజనం పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఆదివారం తాటిచెట్లపాలెంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ మారుతి షరీఫ్ కుమార్, ఏఎస్ఓసీ అహ్మద్ షరీఫ్, ట్రెనింగ్ కౌన్సిలర్ గుండి జానకిరాము, గైడ్ కెప్టెన్ పి.వాణి, రేంజర్ లీడర్ నజ్మా భాను, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ బుక్ చేశారా.. ఓ వారం ఆగాల్సిందే



బహిరంగ ప్రదేశంలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు

- వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్న ఏజెన్సీలు
- సకాలంలో సరఫరా కాని గ్యాస్ సిలిండర్లు
- పండగ రోజుల్లో ఇవేం కష్టాలంటున్న ప్రజానీకం
- ఇంటికి తీసుకొస్తే అదనపు బాదుడు

విశాఖ విద్య: వినియోగదారులకు గ్యాస్ బండ సకాలంలో ఇళ్లకు చేరడం లేదు. ఆన్‌లైన్‌లో గ్యాస్‌కోసం నమోదు చేసినప్పటికీ ఎప్పటికి వస్తాదో తెలియని పరిస్థితి నెలకొంది. దీపావళి పండగరోజుల్లో ఇవేం గ్యాస్ కష్టాలని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో పొయ్యి వెలగక అష్టకష్టాలు పడుతున్నారు. గ్యాస్‌కోసం ఏజెన్సీల వారిని సంప్రదించినా తామేమీ చేయలేమని చేతులెత్తేయడంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్క కూటమి ప్రభుత్వం దీపావళి పండగకు ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తామని ఆర్భాటపు ప్రచారాలు చేస్తుండగా, కొనుక్కుందామన్నా గ్యాస్ దొరకని పరిస్థితులు ఎదురవుతుండటం గమనార్హం.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

వినియోగదారులకు ప్రస్తుతం గ్యాస్ బుకింగ్ అంతా ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతోంది. ఇలా నమోదు చేసుకున్న వారికి గ్యాస్ బుకింగ్ నంబర్ కూడా వినియోగదారుల సెల్‌ఫోన్‌కు వస్తోంది. కానీ గ్యాస్ బండ మాత్రం సకాలంలో ఇళ్లకు చేరడం లేదని వినియోగదారులు అంటున్నారు. గతంలో గ్యాస్ బుక్ చేసిన రెండు రోజులకే ఇళ్ల ముందు బండ ఉండేదని, కానీ ఇప్పుడు వారం రోజులు ఎదురు చూడాల్సి వస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. గ్యాస్ ఏజెన్సీల్లో నిల్వలు, సరఫరా వంటి అంశాలపై సివిల్ సప్లై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సి ఉంది. కానీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఏజెన్సీల వారిదే ఇష్టారాజ్యమవుతుందనే విమర్శలు ఉన్నాయి.

బహిరంగ ప్రదేశాల్లో నిల్వలు

గ్యాస్ బండలను గోదాముల్లో మాత్రమే నిల్వ చేసి అక్కడ నుంచి వినియోగదారుల ఇళ్లకు సరఫరా చేయాలి. కానీ, గ్యాస్‌తో ఉన్న సిలిండర్లను బహిరంగ ప్రదేశాలు, రహదారులపై నిల్వ చేసి అక్కడ నుంచి సమీప ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. దీని వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాధ్యులెవరని సమీప ఇళ్లవారు ప్రశ్నిస్తున్నారు. గ్యాస్ గోదాములపై సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణలేకపోవడంతోనే ఇలా జరుగుతుందని వినియోగదారులు అంటున్నారు.

డోర్ డెలివరీకి అదనపు బాదుడు

ఏజెన్సీ వారు నిర్ణీత ధర మేరకు గ్యాస్‌ను ఇళ్లకు సరఫరా చేయాలి. కానీ ఇక్కడ వినియోగదారులపై అదనపు భారం వేస్తున్నారు. 14.2 కేజీల గ్యాస్ బండకు రూ.811లు చెల్లిస్తే చాలు. కానీ గ్యాస్ బండను ఇంటికి తీసుకొచ్చే వారు అదనంగా మరో రూ.30 నుంచి రూ.40 ల వరకు వసూలు చేస్తున్నారు. ఇదేమని అడిగితే డెలివరీ చార్జీలు బిల్లులో ఉండవని సమాధానం చెబుతున్నారు. ఇలాంటి వాటిపై సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వినియోగదారులకు అదనపు భారం తప్పడం లేదు.

పండగ రోజుల్లోనూ..

దీపావళి పండగ రోజుల్లో గ్యాస్ కష్టాలు ఎదురవ్వటంపై వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఇలాంటి సమస్యలపై ఏమాత్రం దృష్టిపెట్టకపోవటంతోనే వినియోగదారులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆరోపిస్తున్నారు. ఉచిత గ్యాస్ పథకం మాట దేవుడెరుగు...ప్రస్తుతం వంట చేసుకునేందుకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు ఇళ్లకు సరఫరా చేస్తే చాలని వినియోగదారులు అంటున్నారు.

వెలుగుల మాటున ముప్పు!

- అనుమతుల్లేని బాణసంచా దుకాణాలకు అడ్డుకట్ట వేయాల్సిందే
- ఎన్ఏడీలో కూటమి నేతల కనుసన్నల్లో దుకాణాలు
- అనుమతులు లేకున్నా.. ఆర్భాటపు ప్రచారం



గతేడాది ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

విశాఖ విద్య: దీపావళి పండగ వస్తుందంటే చాలు పిల్లల నుంచి పెద్దల వరకు అదో సంబరమే. సీమటపాకాయలు, సిసింద్రీలు, కాకరపువ్వొత్తులు, భూచక్రాలు, డాం డాం అనే బాంబుల మోత మోగించేందుకు అంతా సిద్ధమవుతారు. ప్రతీ ఇంటా వెలుగులు ఇచ్చే దీపావళి పండగ...తేడా వస్తే అదే చీకటి నింపే ప్రమాదం కూడా ఉంది. బాణ సంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిబంధనలివీ..

- బాణసంచా విక్రయాల వ్యాపారం మంచి లాభాలే తెచ్చిపడుతుంది. దీంతో వీటిని ఏర్పాటు చేసేందుకు ఎక్కువ మంది వ్యాపారులు ఆసక్తి చూపుతారు. అయితే అన్ని అనుమతులు ఉన్న వారే దుకాణాలు ఏర్పాటు చేసేలా అధికారులు దృష్టి పెట్టాలి.
- అగ్నిమాపక, విద్యుత్, పోలీసు శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకునేలా అధికారులు అప్రమత్తం చేయాలి. బాణ సంచా విక్రయ పాంతంలో విధిగా ఇసుక, నీరు తగినంత అందుబాటులో ఉంచేలా దుకాణదారులను ముందుగానే హెచ్చరించాలి.

అనుమతులకు అధికారులపై ఒత్తిడి

నియోజకవర్గంలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు విషయంలో కూటమి నేతలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కొన్ని చోట్ల అధికారుల నుంచి అనుమతులు తీసుకోకుండానే దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది.90వ వార్డుకు చెందిన ఓ టీడీపీ నేత బాణ సంచా స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్ఏడీ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా ఫ్లెక్సీలు పెట్టారు. ఇంకా అనుమతులు రాకముందే ఇలా ఆర్భాటపు ప్రచారమేంటని వీటిని చూసిన వారు పెదవి విరుస్తున్నారు. అధికారులు ఇలాంటి వాటిని సీరియస్‌గా తీసుకోకపోతే, నిబంధనలు గాలికొదిలేసి ఏర్పాటు చేసే దుకాణాలతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు లేకపోలేదని పలువురు అంటున్నారు.

> **అనుమతి లేకుండా దుకాణాలు పెట్టొద్దు**
>
> బాణ సంచా దుకాణాల ఏర్పాటుకు నిబంధనల మేరకు అన్ని రకాల అనుమతులు తీసుకోవాలి. ఇప్పటి వరకు మాకు రెండు చోట్ల ఏర్పాటుకు దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఉన్నతాధికారుల అనుమతితో నిబంధనల మేరకు పరిశీలన చేస్తున్నాం. ఫైర్, విద్యుత్, జీవీఎంసీ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకొని, మాకు కూడా దరఖాస్తు చేసుకోవాలి.
>
> – శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ

స్టీల్‌ప్లాంట్ రక్షణకు తక్షణమే రంగంలోకి దిగాలి



మాట్లాడుతున్న జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తక్షణమే రంగంలోకి దిగి స్టీల్‌ప్లాంట్‌ని కాపాడాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. జగ్గు నాయుడు తెలిపారు. ఆదివారం సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ఇప్పుడు రంగంలోకి దిగకపోతే చేజారిపోయినట్టేనన్నారు. సంస్థను దిగజార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వక, వారిని వీఆర్ఎస్ తీసుకునేటట్టు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, సెక్యూరిటీ సిబ్బందికి కూడా జీతాలు ఇవ్వక ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ని అభివృద్ధి బాట పట్టిస్తామన్నారని.. అభివృద్ధిని పక్కన పెడితే మునిగిపోకుండా చూడాలని హితవు పలికారు. సమావేశంలో కృష్ణారావు, సూరీడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటి మీద మిద్దె తోటలు పెంచాలి



మర్రిపాలెంలోని మిద్దె తోటలో మహిళలు

మర్రిపాలెం: ప్రతి ఇంటి మీద మిద్దె తోటలు పెంచాలని వనమాలి, సీటీజీ సంస్థలు ఆదివారం పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ఇందులో భాగంగా మర్రిపాలెంలో గ్రీన్ క్లైమేట్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం ఎకో వైజాగ్‌లో భాగంగా ఆకుకూరల విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థల ప్రతినిధులు అరవల అరుణ, మళ్ల సరిత, నాదెళ్ల జ్యోతి మాట్లాడుతూ ప్రతీ నెలా నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపుతీత మందులతో పండిస్తున్న ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వల్ల అనారోగ్యం కలుగుతుందని హెచ్చరించారు. ఉత్తర నియోజకవర్గం పరిధిలోని మర్రిపాలెం, మురళీనగర్ తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటి మీద మిద్దె తోటలు పెంపకం వివరాల కోసం 77949 30439, 85008 74103లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎకో విజనరీ పర్యావరణ సంస్థ ప్రతినిధులు జి.దనూష, డి.పూజిత, కె.మేఘన, కె.ఎల్.దీపిక, కె.కుసుమ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీజేపీ సభ్యత్వ నమోదు

మల్కాపురం: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం 61వ వార్డు మల్కాపురం వద్ద ఆ పార్టీ నాయకులు సంతోష్,లక్కరాజ్ రామకృష్ణ,విజయ్‌బాబు,నానాజీ నిర్వహించారు. దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని అంతా పార్టీలో భాగస్వాములు కావాలని కోరారు.పలువురికి ఆన్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేశారు.

అభాగ్యుడిని కేజీహెచ్‌లో చేర్పించిన రెడ్‌క్రాస్



అభాగ్యుడిని కేజీహెచ్‌కు తరలిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది

డాబాగార్డెన్స్: రెడ్‌క్రాస్ సొసైటీ అభాగ్యుడిని కేజీహెచ్‌లో చేర్పించి సేవా నిరతి చాటుకుంది. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ఎంవీపీ సీఐ మురళి, ఎస్సై శ్రీనివాస్ సమక్షంలో లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం సమీపాన గల బస్టాప్‌లో గుర్తు తెలియని అభాగ్యుని కాలికి దెబ్బ తగిలి, పురుగులు పట్టేసిన స్థితిలో అవస్థలు పడుతుండడాన్ని ఎంవీపీ సీఐ రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం అందించారు. దీంతో రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది అక్కడికి చేరుకుని అభాగ్యుడిని కేజీహెచ్‌కు తరలించారు.

రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్



కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారకా సీఐ డీవీ రమణ

సీతమ్మధార: రౌడీయిజం చేస్తే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ద్వారకా పోలీస్ స్టేషన్ సీఐ డి.వి.రమణ హెచ్చరించారు. అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. వారి వేలిముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై నిఘా పెంచామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, గొడవలు, బెదిరింపులకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, ఏఎస్ఐ డి.వి.రత్నం, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: జేవీవీ చెకుముకి సంబరాల్లో భాగంగా నవంబర్ 19 నుంచి 21 వరకు నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు, ప్రొఫెసర్ పద్మ, జేవీవీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బాలోత్సవ ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది బాలోత్సవంలో 6 వేల మంది పిల్లలు 95 స్కూల్స్ నుంచి 74 ఈవెంట్లలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సంవత్సరం కూడా బాలోత్సవాన్ని సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నామని తెలిపారు. చెకుముకి సంబరాలకు హాజరయ్యే కరటీచర్లు సహకారం అందివ్వడం ద్వారా ఎక్కువ మంది పాల్గొనేటట్టు చూడాలని, పెందుర్తి నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు వరకు ఉన్న స్కూళ్లకు డిసెంబర్‌లో ప్రత్యేకంగా నిర్వహిస్తామని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గోపాలరావు, ఉపాధ్యక్షుడు మురళీధర్, జిల్లా నాయకులు ఎస్‌వీకే పరశురామ్, శేషగిరిరావు, లక్ష్మణస్వామి, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు



గౌరీ పరమేశ్వరులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గవరవీధి రామాలయం వద్ద గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో సుమారు 43 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేశారు. కార్తీక మాసం నెల రోజులు తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తారు.

నవంబర్ 1న ఆకాశ దీపారాధన ప్రారంభమవుతుంది. 25న గౌరీపరమేశ్వరుల కల్యాణం అత్యంత వైభవోపేతంగా జరిపించనున్నారు. ఉత్సవాల్లో ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహక కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రకృతి విపత్తుల్లో సహాయక చర్యలపై శిక్షణ



ఫైర్ క్యాంప్ వేస్తున్న బాలికలు



నృత్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

సింధియా: భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ తరపున జిల్లా స్థాయి బాలికల తృతీయ సోపాన్ పరీక్షా శిబిరం మల్కాపురం నౌసేనబాగ్ కేంద్రీయ విద్యాలయం–1లో శనివారం ప్రారంభమైన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో రెండో రోజు ఆదివారం ప్రకృతి విపత్తుల సమయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రజలకు ఏ విధంగా సహాయం చేయాలనే అంశంపై బాలికలకు శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థినులందరూ ఒక చోట చేరి ఫైర్ క్యాంప్ ఏర్పాటు చేసుకుని నృత్యాలు, పాటలతో సందడిగా గడిపారు. ముఖ్య అతిథులు కేవీ–1 ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మైంగి, హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ స్టేట్ కమిషన్ ఆఫీసర్ జ్యోతి నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో విశాఖపట్నం సెయింట్ జోసఫ్ స్కూల్ టీచర్ ఎంవీఆర్ లక్ష్మి, కేవీ–1 పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు



ప్రకాష్‌నగర్‌లో పనిచేయని తాగునీటి బోరు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్‌లో నీటి ఎద్దడితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న తాగునీటి బోరు పనిచేయకపోవడంతో మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బోరుబావికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వృక్షజాతుల సంరక్షణ అవసరం



శాస్త్రవేత్త ఎస్.ఎస్.దాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

మద్దిలపాలెం: వృక్షజాతుల సంరక్షణతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'తూర్పు కనుమల్లోని స్థానిక వృక్షజాతుల పరిరక్షణ' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక వృక్షజాతులను సంరక్షించడం ఎంతో అవసరమన్నారు. అణుబాంబుల వల్ల పర్యావరణానికి జరిగిన నష్టాన్ని వివరించారు.

బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా కోల్‌కతా శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఎస్.దాస్ మాట్లాడుతూ సంగీతానికి సైతం స్పందించే గుణం మొక్కలకు ఉందని ఇటీవల పరిశోధనలు స్పష్టం చేశాయన్నారు. ప్రకృతితో కలిసి ప్రయాణించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. శాస్త్ర సంబంధమైన జ్ఞానాన్ని సేకరించడం, సరిచూసుకోవడం, దానిని భద్రపరచడం ఎంతో అవసరమన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఎస్.బి.పడాల్ మాట్లాడుతూ ఏయూ బొటానికల్ గార్డెన్‌లో 30కి పైగా అరుదైన జాతులను సంరక్షిస్తున్నామని తెలిపారు. తూర్పు కనుమల ప్రత్యేకతలు, సదస్సు విశిష్టతను వివరించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ మైనింగ్, టూరిజం, అడవులను ఆక్రమించడం వంటి చర్యల ఫలితంగా అటవీ విస్తీర్ణం తగ్గిపోతూ సహజ వృక్షజాతులు దెబ్బతింటున్నాయన్నారు. అటవీ శాఖ ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలను రూపొందించి నిర్వహించాల్సిన విధానాన్ని తెలియజేశారు. విభాగాధిపతి ఆచార్య డి.సంధ్యాదీపిక మాట్లాడుతూ విభాగ ప్రగతిని వివరించారు. శాస్త్రవేత్త ఎస్.ఎస్.దాస్‌కు ఏయూ తరపున వీసీ జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు రత్నకుమార్, సుజాత, బలరామ స్వామి యాదవ్, సంధ్యశ్రీ, ఎస్.ఎన్.దొర, విశ్రాంత ఆచార్యులు వెంకయ్య హర శ్రీరాములు, సీడీసీ డీన్ టి.వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నాటి ఉపాధ్యాయులతో 2002-03 బ్యాచ్ విద్యార్థులు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు మర్రిపాలెంలోని ఎస్ఈ రైల్వే ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 2002–2003లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు సందడి చేశారు. వీరంతా ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆత్మీయ పలకరింపులతో సందడిగా గడిపారు. ప్రస్తు పరిస్థితులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 21 ఏళ్ల తర్వాత తోటి విద్యార్థులతో పాటు నాటి ఉపాధ్యాయులను కలుసుకోవడం ఆనందంగా ఉందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు.